# సంక్రాంతి

శ్రీ ధాయిపులె బాలకృష్ణరావు

ఈ రోజు రాత్రి కొంచెము త్వరగానే పడుకున్నాను. నిద్రాదేవి నన్నింకా ఆమె ప్రశాంత కౌగిటిలో చేర్చుకోలేదు. మా రూము మేట్లిద్దరు మాట్లాడుతూ అసందర్భంగా 'సంక్రాంతి పండుగ' అని వాళ్ళ నోటినుండి రెండు మాటలు వెలువడ్డాయ్. అంతే! తలుచుకుంటూ కొద్ది క్షణాల్లో నిద్రపోయాను, రాత్రి కలగన్నాను.

ఎంత శోభాయమానంగవుంది యీ రోజు. ఏంటి యీ రోజు మా అమ్మ ధోరణిమార్చి తలంటుస్నానం చేయమంటుంది నన్ను! ఎప్పుడూ లేని పిల్లల అలజడి మా యింట్లో క్రొత్తగావుందే. మామూలుగావుండే గోలకంటే యీ గోల కొంచెము కిలకిలలతో యిల్లంతా కళకళలాడుతుందేమిటి - అనుకుంటూ నివ్వెఱపోయి చూస్తూ నిలబడ్డాను. "ఏరా అలా చూస్తున్నావే - నీకేమైన మతిపోయిందా. ఈ రోజు సంక్రాంతి పండుగకదూ! మరిచిపోయావూ. తలంటుస్నానంచేద్దువుపదా!" అంది మా అమ్మ. పండలైపోయాను. కడలిలోని అలలు రివ్వున యెగసి వచ్చి జివ్వున ముఖముపై నీళ్లు జిమ్మినట్లయ్యాయ్. తేరుకున్నాను. తెలిసికొన్నాను యీ రోజు సంక్రాంతని. ఔరా! కాలచక్ర పరిభ్రమణ మెంత త్వరితము? అటులపోయిన సంక్రాంతి అపుడే యిటుల వచ్చినదే. కొంచెము విదాన్నిస్తే దాని అబ్బగంటు ఏమిపోతుంది?... ఓహో! దానికేమైనా మన మానవుల్లోలాగె బానిసలను కసరికొట్టేలాంటి వాళ్లున్నారేమో. అవును - వున్నాడుగా వారికీ - మనకు అధినేత, సూత్రధారుడు - దేవుడు. ఈ విషయాల్ని శాస్త్రి విద్యార్థులకు చెబితే నవ్వుతారేమో! వాళ్లు దేవుడున్నాడని నమ్మరుగా!!

తలంటుచేశాను. బట్టలు వేసికొన్నాను. సాయంత్రమైంది. ఎక్కడికి పోవడానికి మనస్కరించలేదు.

"ఏరా! యింట్లో యిలాగే కూర్చుంటావా! కూపస్థమండూకంలా. పండుగరోజు అలా ఒకసారి బయటికిపోయి రాకూడదూ." మా బామ్మ లోపలి నుండి కేంకారావాలు పెట్టింది. వచ్చానురా దేవుడా అనుకొని బట్టలు సర్రున మార్చుకొని తుర్రున బయటికి వెళ్ళిపోయాను.

రంగురంగుల చీరె లలంకరించి సుగుణాలరాసులు, అందాలరాసులు, రకరకాల రాసులగు నారీమణులు బజారువీధిలో బయలుదేరారు. దేవాళయము వేపు పోతుండే మగువల అందాన్ని రసగ్రహపారీణులగు మగవాళ్ళు చూస్తూ ఆనందిస్తూ నిలబడ్డారు.

దినకరుడు పక్షపాతంలేకుండ లోకాన్ని పరామర్శించి పడమటి కొండల లోయల్లోకి మెల్లిమెల్లిగ విగళితుడగుచున్నాడు. రంగురంగుల చీరెలసొంపు ఆ సంధ్యాసమయ కమల బాంధవ కిరణకాంతులచే తళతళమని మెరుస్తూవుండినవి. వాళ్ళ నడకల కదలికచే చీర కుచ్చెళ్ళు పవనవేగ ప్రసారితంచే నాట్యమాడసాగాయ్. వారి పదములకావృత్తమైవున్న గొలుసుల నాదము ఆ నాట్యానికి లయగా కుదురుకొని పడతుల నడకలకొక అందాన్ని చేకూరుస్తూవున్నయ్. పవనప్రసారితముచే బజారుధూళి కంధూళులై వారి వదనమండలమున పౌడరువలె నెలత వహిస్తుండెను. కొందరు రమణీమణులు జలతారు లేసులతో అల్లిన చేతిగుడ్డలను ముఖమునకు చేర్పిస్తుండిరి. కొందరు స్త్రీలు యీర్ష్యచే యితర వస్త్రాభరణులగు వారినిచూచి తమ ఆభరణములను సవరించుకొనుచు చరచరా నెలయేటిలా ముందుకు సాగిపోతుండిరి. కొన్ని క్షణాల్లో చెఱువుగట్టుపై జనసమూహము కిటకిటలాడుతుండినది.

మలయమారుత పవనాలు మంద, మందంగా నంద్యాల చెఱువుమీదుగవీచి గట్టుపైనున్న జనసమూహాన్నెదుర్కొని చక్కిలిగింతలు పెడుతుండెను. అందరును బ్రహ్మానందులై వుండిరి. చెఱువుగట్టుపై కూర్చొని కారాలుతింటూ ప్రకృతిమాతను తిలకిస్తున్న నా దగ్గరికి ఒక పాతస్నేహితుడొచ్చి కారాలుపెట్టమని బలవంతంచేశాడు. మతిమరుపునే కసరికొట్టాను. నా విలక్షణ స్వభావము అతనికి నచ్చలేదు. వాడికి "నేలయు నింగియుఁ దాళముల్ గాజేసి" అన్నంత కోపమువచ్చి తన ముష్టిబంధముచే ఒక్కవ్రేటు వేశాడు. నేను ఆ దెబ్బకు రెండు దొర్లులు దొర్లాను.

ఉషోదయము కావస్తుంది. కళ్లు నులుపుకుంటూ లేచి చూచేప్పటికి సిమెంటు బెంచిమీదినుంచి క్రిందికి దొర్లిపడివున్నాను. కలికాలపు కలలు యింతేనా అని అనుకున్నాను!!